సాక్షి చిత్తూరు

మంగళవారం ౹ 30 ౹ జనవరి ౹ 2024



స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం

కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి సోమవారం స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. - 8లో



తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

బాలిక అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా వారు 24 గంటల్లోనే కేసు ఛేదించి, బాలికను అప్పగించారు. - 8లో



ముగిసిన జిల్లా స్పోర్ట్స్ మీట్

చిత్తూరు పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్పోర్ట్స్ మీట్-2024 సోమవారం అట్టహాసంగా ముగిసింది. - 8లో

న్యూస్‌రీల్

చిత్తూరు ఎస్పీగా జాషువా



జాషువా

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీగా పి.జాషువాను నియమిస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న జాషువాను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. చిత్తూరులో పనిచేస్తున్న రిషాంత్ రెడ్డిని కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా జాషువా 2022 జూన్ నుంచి కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈయన 2013లో పలమనేరు డీఎస్పీగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాషువాను చిత్తూరుకు బదిలీ చేశారు. ఈ వారంలోనే జాషువా చిత్తూరులో బాధ్యతలు తీసుకోనున్నారు. మరోవైపు రిషాంత్ రెడ్డికి తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగానికి ఇన్‌చార్జిగా సైతం నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలబాలికల చట్టాన్ని ఉల్లంఘించొద్దు



సివిల్ జడ్జి కరుణ కుమార్

చిత్తూరు అర్బన్: బాల బాలికల చట్టాన్ని ఉల్లంఘించి, 18 ఏళ్లలోపు వారిని సాధారణ జైలులో ఉంచరాదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కోర్టు న్యాయసదన్ భవనంలో సోమవారం ఆయన బాలబాలికల చట్టంపై మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సుప్రీంకోర్టు, జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు 18ఏళ్లలోపు వారిని జైలుకు కాకుండా జువైనల్ హోమ్స్‌కి పంపాలని స్పష్టం చేశారు.

రేపు జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి పద్మజ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన, 30 ఏళ్లలోపు అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ముందస్తుగా www.employment.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకున్న తర్వాత జాబ్‌మేళాకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,142 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

యుద్ధం.. 'సిద్ధం'



ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నేతలు సన్నద్ధమయ్యారు. సోమవారం ఈ మేరకు తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, నియోజక వర్గ సమన్వయకర్తలు హాజరయ్యారు. కుప్పంతో సహా రాయలసీమలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించారు. అనంతపురంలో నిర్వహించనున్న 'సిద్ధం' సభను నభూతో నభవిష్యత్ అన్నట్టు విజయవంతం చేయాలని సంకల్పించారు. - సాక్షి, తిరుపతి

నేడు ఐటీఐ భవనం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఐటీఐ భవనం

విజయపురం (నగరి) : విజయపురం మండలం మాధవరం గ్రామంలో నిర్మించిన ఐటీఐ భవనాన్ని మంగళవారం మంత్రి రోజా ప్రారంభించనున్నారు. నగరి, సత్యవేడు నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు 2008 వరకు ప్రభుత్వ ఐటీఐ చదవాలంటే 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి వెళ్లేవారు. ఆ సమస్యకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిష్కారం చూపించారు. రెండు నియోజకవర్గాల వారికి అందుబాటులో విజయపురం మండలం మాధవరం పంచాయతీ ఎల్లసముద్రం గ్రామంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే సొంత భవనం లేకపోవడంతో ఇప్పటి వరకు అద్దె భవనంలోనే కొనసాగుతూ వచ్చింది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేయకపోవడంతో కళాశాలకు సొంత భవనం అందని ద్రాక్షగా మారింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఆర్‌కే రోజా కళాశాలకు సొంత భవనం ఏర్పాటుపై అత్యంత శ్రద్ధ చూపారు. దీంతో వైఎస్సార్ మంజూరు చేసిన కళాశాలకు జగనన్న పాలనలో సొంత భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరైంది. మంత్రి రోజా శంకుస్థాపన చేసి 6 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని ఆదేశించడంతో పనులు వేగంగా సాగాయి. దీంతో భవన నిర్మాణం పూర్తయింది. ఈ నూతన భవనాన్ని మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం ప్రారంభించనున్నారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభోత్సవం చేయనున్నారు.



సచివాలయంతో గ్రామ స్వరాజ్యం



చందం సచివాలయం



లబ్ధిదారుల సమస్యలు వింటున్న సిబ్బంది

నియోజకవర్గ సమాచారం	
మండలాలు	4
సచివాలయాలు	93
పనిచేసే సిబ్బంది	462
వలంటీర్లు	1374

పథకాల వివరాలు

పథకాలు	లబ్ధిదారులు	నగదు కోట్లల్లో
వైఎస్సార్ చేయూత	17,360	62.42
అమ్మ ఒడి	34,678	116.79
విద్యాదీవెన	1,266	25.02
పేదలకు ఇళ్లు	4,943	54.17
పెన్షన్లు	35,291	203.64
వైఎస్సార్ ఆసరా	55,260	198.73
రైతు భరోసా	50,050	114.83

సచివాలయం..బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి చిహ్నం. ఈ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుంది. ఇందులో పనిచేసేందుకు అవసరమైన ఉద్యోగులను సుమారు లక్షన్నర మందికి పైగా నియమించింది. తద్వారా ప్రభుత్వ పాలన ఇంటివద్దకే వచ్చింది. ఎలాంటి అవినీతి లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు గడప వద్దకే అందించేందుకు మార్గం సుగమం అయింది. మండల కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా ప్రభుత్వం సకల సేవలను గ్రామం ముంగిట్లోకి తీసుకొచ్చింది.

- పేదల ముంగిట్లోకి సుపరిపాలన
- గ్రామీణులకు అందుబాటులో సకలసేవలు
- వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

కుప్పం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు విజయవంతంగా సేవలందిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు వేదికగా మారడంతోపాటు సంక్షేమ పథకాల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటివరకు 2.94 లక్షల మందికి రూ.1,066 కోట్లను సచివాలయ వ్యవస్థ ద్వారా అందజేసింది.

ఇంటి వద్దకే సంక్షేమం

సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుతోంది. వలంటీర్ల ద్వారా పింఛన్ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వరకు ప్రతి పథకం లబ్ధిదారులకు అందుతోంది. ఎలాంటి అవినీతి లేకుండా పారదర్శకంగా పథకాలు అందించడం ఈ ప్రభుత్వం ప్రత్యేకత. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఎప్పుడూ లేని విధంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా సాగుతున్న పాలనా వ్యవస్థపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సులువుగా సేవలు

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 540 రకాల ప్రభుత్వ సేవలు అమల్లోకి తీసుకువచ్చారు. ఇందులో సాంకేతిక కారణాల వల్ల కొన్నింటికి అవాంతరాలు ఎదురుకావడం వల్ల 500 పైగా సేవలు సులభంగా అందుతున్నాయి. కొత్త రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్చడం, తొలగించడం, పెన్షన్, కుల, నివాస, ఇతర ధ్రువీకరణ కరపత్రాలు, విద్యుత్ కనెక్షన్లు, బిల్లుల చెల్లింపు, ఆస్తి, కొళాయిపన్ను చెల్లింపు, పట్టాదారు పాసుపుస్తకాలు వంటి అనేక సేవలు గ్రామంలోనే లభిస్తున్నాయి.

డిజిటల్ బోర్డులపై వివరాలు

ప్రతి సచివాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రతి ఒక్కరికీ తెలిసే విధంగా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందారు, ఎంత నగదు డీబీటీ, బీబీటీ ద్వారా చేరిందనే విషయం ఈ బోర్డుల్లో పొందుపరచడం పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అయింది.

ఇంటి వద్దకే సర్టిఫికెట్లు



ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి గతంలో తిరిగేవాళ్లం. అక్కడున్న సిబ్బందికి ఎంతోకొంత ముట్టజెబితేకానీ సర్టిఫికెట్ చేతికొచ్చేది కాదు. జగనన్న సురక్ష ద్వారా మాకు కావాల్సిన 12 రకాల సర్టిఫికెట్లను ఇంటి వద్దకే చేరుస్తున్నారు. ఇలాంటి పాలనను నేను చూస్తానని కలలో కూడా అనుకోలేదు.

– చంద్రకళ, గాంధీరోడ్డు, కుప్పం

అందరికీ అందుబాటులో..



సచివాలయ వ్యవస్థ వల్ల అధికారులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. గతంలో ఏ సమస్యను తెలియజేయాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. దీంతోపాటు పనులు కూడా అంత త్వరగా సులభంగా అయ్యేవి కావు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలోనే సచివాలయానికి వెళ్లి సమస్యను చెప్పుకుంటే అధికారులు పరిష్కరిస్తున్నారు. ఎంతో సంతోషంగా ఉంది.

– సుబ్బప్ప, గుత్తార్లపల్లి

పెన్షన్ కోసం నిరీక్షణ తప్పింది



గతంలో ప్రతి నెలా పెన్షన్ తీసుకోవాలంటే ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటల కొద్దీ నిరీక్షించే వాళ్లం. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నారు. ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఎవరికీ లంచాల్సిన పని లేకుండా నేరుగా ఇంటికే పింఛన్ తెచ్చిస్తున్నారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సుబ్బమ్మ, గాండ్లవీధి, కుప్పం

జగనన్నకు రుణపడి ఉన్నాం



రెవెన్యూ విభాగం నుంచి, పారిశుధ్యపనులవరకు ఎలాంటి సమస్యలైనా సరే మండల కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సచివాలయంలో ఉన్న ఉద్యోగులకు కానీ, వలంటీర్‌కు కానీ చెబితే చాలు. వారు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నాం.

– మురుగేష్, గుత్తార్లపల్లి

సచివాలయ సేవలు అభినందనీయం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయంలో చేపడుతున్న సేవలు అభినందనీయం. ఏ పని కావాలన్నా ఇక్కడే పరిష్కారం అవుతోంది. మండల అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. ఒక పూట సచివాలయానికి వెళితే వెంటనే నమోదు చేసుకుని నెంబరు ఇస్తారు. ఈ సమస్యపై సమయం, రోజు చెప్పి ఫోనుకు ఎస్ఎంఎస్ పంపుతారు.

– రమణప్ప, గోవిందపల్లి, గుడుపల్లె మండలం

1న స్థాయీ సంఘాల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం ఫిబ్రవరి 1న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆ రోజు 2-6 వరకు స్థాయీ సంఘాల సమావేశం జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. గ్రామాభివృద్ధి, విద్య, వైద్య, వ్యవసాయ, మహిళా సంక్షేమ, సాంఘిక సంక్షేమం అంశాలపై సమావేశం ఉంటుందని సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని వివరించారు.

గ్రామాల్లో నగదురహిత చెల్లింపులు

చిత్తూరు కార్పొరేషన్: గ్రామాల్లో నగదు రహిత చెల్లింపులు జరిగే విధంగా చర్యలు చేపట్టినట్లు డీపీఓ లక్ష్మి సోమవారం తెలిపారు. పీఓఎస్ మిషన్ల ద్వారా నగదు చెల్లింపులపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలోని 113 గ్రామ పంచాయతీలకు 145 పీఓఎస్ యంత్రాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. మూడు వేల జనాభా ఉన్న పల్లెల్లో వీటిని వినియోగిస్తారన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. నగదు రహితంగా ఇంటి పన్ను, ఇతర పన్నుల వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఆసరాతో ఆర్థిక స్వావలంబన

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



పాల్గొన్న డ్వాక్రా మహిళలు



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన ద్వారా అతివలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. మండలంలో సోమవారం నిర్వహించిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా మంజూరు కార్యక్రమానికి డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 961 స్వయం సహాయక సంఘాలకు చెందిన 9,284 మంది డ్వాక్రా మహిళలకు రూ.9 కోట్ల 70 లక్షల 38 వేలు మంజూరైంది. దీనికి సంబంధించి మెగా చెక్కును ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మహిళలకు అందజేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లు లేని వారికి ఇళ్లను నిర్మించి, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అన్ని రకాలుగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సమాజంలో అన్ని రకాల అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా పేద ప్రజలను ప్రోత్సహిస్తూ చేయిపట్టి నడిపిస్తున్న ప్రభుత్వం అని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తునూ, సమూల మార్పు ద్వారా వారి తలరాతలనూ మార్పు చేస్తున్నట్లు వెల్లడించారు. పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాల కడుపు మండిపోయి, ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండి అని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఏ కుటుంబానికైనా అన్యాయం జరిగిందా అంటూ మహిళలను అడగడంతో లేదని చెప్పడంతో సభా ప్రాంగణమంతా ఒక్క సారిగా చప్పట్లు ప్రతిధ్వనించాయి. అంతకు ముందు సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డ్వాక్రా మహిళలు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చరిత్రాత్మకం

విజయవాడ నడి బొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు ప్రపంచ చరిత్ర పుటల్లోకెక్కిందని, ఇది దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలతో పాటు ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకునేలా ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎంపీటీసీలు రాధిక, మునిచంద్రారెడ్డి, భాస్కర్, గుణశేఖర్, చిన్నబ్బ, సర్పంచ్‌లు శిల్ప, గోవిందయ్య, శేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ లోకనాథరెడ్డి, డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పురుషోత్తం, మాజీ సర్పంచ్‌లు గోవిందయ్య, హేమశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, శ్యామల, బాలకృష్ణారెడ్డి, నాయకులు బొజ్జా రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వెంకటేశ్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా మార్పులు చేర్పులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల జాబితాలో మార్పులు, చేర్పులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పకడ్బందీగా చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించాలని చెప్పారు. ఆ తర్వాత మంగళవారం సాయంత్రం లోపు వాటికి సంబంధించి ఆన్‌లైన్‌లో నివేదికను అందజేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లోపాలు లేకుండా కసరత్తు చేయాలన్నారు. కసరత్తులో ఎలాంటి అలసత్వం వహించినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం నుంచి పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

రొంపిచెర్ల: అదృశ్యమైన బాలికను 24 గంటల్లో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగిరి దళితవాడకు చెందిన శివయ్య కుమార్తె (17) ఈ నెల 28న ఉదయం ఇంటి నుంచి అదృశ్యం అయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను సోమవారం భాకరాపేటలో ఉండగా అదుపులోకి తీసుకుని విచారించారు. బంధువుల ఇంటికి వెళ్లానని చెప్పడంతో సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు.

స్పందన అర్జీలకు పరిష్కారమార్గం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: స్పందన అర్జీలను తక్షణమే పరిశీలించి పరిష్కారమార్గం చూపాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఏఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, పోలీసు సేవలపై ప్రజలు ఏఎస్పీకి వినతులు ఇచ్చారు. మొత్తం 25 అర్జీలు రాగా, వాటిని నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం



ఆలయ మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారి స్వర్ణరథం



సంకటహర చతుర్థి వ్రతంను నిర్వహిస్తున్న అర్చక వేదపండితులు, ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణ రథంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. సంకటహర చతుర్థి వ్రతం సందర్భంగా సోమవారం ఉదయం ఆలయంలో వ్రతం నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామిని అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అక్కడి నుంచి ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు, ఉభయదారులు అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు రథంలో కొలువుదీర్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో మాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు, ఐరాల జెడ్పీటీసీ సుచిత్ర, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉపసర్పంచ్ విశ్వనాథ రెడ్డి, చిన్నారెడ్డి, పుణ్యసముద్రం రవి, రవిరెడ్డి, రవిచంద్రా రెడ్డి, శైలజచరణ్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం

వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం ప్రతి నెలా నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా సోమవారం ఉదయం, సాయంత్రం రెండు పర్యాయాలు ఈ వ్రతం నిర్వహించారు. మొదటగా సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు, అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆస్థాన మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల మధ్య సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. దీనికి హాజరైన భక్తులు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతం ఆచరిస్తే సమస్త దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ వ్రతానికి క్రమంగా ప్రాధాన్యత పెరుగుతూ వస్తోంది. భక్తులు దీనిపై అవగాహన పెంపొందించుకుని తరలివస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, వేదపండితులు అర్చకులు పాల్గొన్నారు.

పలమనేరు ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



సుమతికి ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు సోమవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. బంగారుపాళ్యానికి చెందిన మోహన్ భార్య సుమతి(32) కొన్నాళ్లుగా కడుపు ఉబ్బరంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం ఆమె స్థానిక ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరిశీలించిన వైద్యులు ఆమె కడుపులో కణితి ఉందని నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన శస్త్రచికిత్సను స్థానిక ఆస్పత్రిలో డాక్టర్ శ్యామలాదేవి, డా.మమతారాణి సర్జరీ నిర్వహించి ఆమె కడుపులోని 1.75 కిలోల కణితిని తొలగించారు. ఏమాత్రం ఆలస్యం చేసినా ఆమె ప్రాణాలకే ముప్పు వాటిల్లేదని వైద్యులు తెలిపారు. ఆ కణితిని పరీక్షల నిమిత్తం పెద్దాస్పత్రికి పంపినట్టు వైద్యులు తెలిపారు.

ప్రజల ముంగిటకే సుపరిపాలన

- జగనన్న పాలనను ప్రశంసిస్తున్న ఆర్థికవేత్తలు
- మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి : ఎమ్మెల్సీ భరత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

బైరెడ్డిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మూలాన పేదరికం బాగా తగ్గిపోయిందని, పేదలంటే జగనన్నకు ప్రాణమని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో 12 శాతం పేదరికం ఉండగా, జగనన్న అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం వల్ల ప్రస్తుతం 4 శాతానికి పేదరికం పడిపోయిందన్నారు. పేదరికం రేటులో ఇంత గణనీయ మార్పులు రావడంపై ఆర్థికవేత్తలు కూడా ప్రశంసిస్తున్నారన్నారు. పేద పిల్లలు పెద్ద చదువులు చదివితే వారి కుటుంబాల తలరాతలు మారిపోతాయని జగనన్న బలంగా నమ్మి, ప్రభుత్వ బడుల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉన్నత పదవులు ఇచ్చి సామాజిక సాధికారత అంటే ఏమిటో చేతల్లో చూపారని చెప్పారు. జగనన్న అధికారంలోకి వస్తే మళ్లీ బడుగు, బలహీన వర్గాలకు పదవులు వస్తాయన్నారు. పేదల బతుకులకు భరోసా ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా ప్రజల ముంగిటకే సుపరిపాలన, సేవలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పరిపాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ నేతలు చంద్రప్ప, రఘునాథరెడ్డి, నాగరాజరెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ స్పందనకు 277 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించండి సారూ అంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్పందనలో 277 అర్జీలు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందనలో ప్రజలు అందజేసే ప్రతి అర్జీని క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించి 277 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఏఓ కులశేఖర్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ట్రయల్ రన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో సోమవారం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ట్రయల్ రన్ నిర్వహించినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఉన్నతాధికారులకు వివరించారు. విజయవాడ నుంచి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కసరత్తుపై సీసీఎల్‌ఏ కార్యదర్శులు సాయిప్రసాద్, ఇంతియాజ్ జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులతో జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ట్రయల్ రన్ నిర్వహించినట్లు చెప్పారు. ట్రయల్ రన్ తర్వాత లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కసరత్తు చేపడుతామన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు 34,961 మంది లబ్ధిదారుల వివరాలు సేకరించినట్లు చెప్పారు. మరో 17,423 మంది వివరాలను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 24,189, పట్టణ ప్రాంతాల్లో 10,772 ఉన్నట్లు తెలిపారు. రోజు వారీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టి వివరాలు తెలియజేస్తామన్నారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌తో పాటు హక్కులు సంక్రమించేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలపారు. వలంటీర్లు క్రమ పద్ధతిలో కార్యక్రమం నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈ సెక్షన్ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కోట : మండలంలోని సిద్దవరం వద్ద సోమవారం రాత్రి లారీ ఢీకొనడంతో వెంకటన్నపాళానికి చెందిన నాగమణి(48) మృతి చెందింది. ఆమె తన భర్త శంకరయ్యతో కలిసి బైక్‌పై కనుపూరు నుంచి తిరిగి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

ముగిసిన జిల్లా స్పోర్ట్స్ మీట్



గేమ్స్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు అర్బన్: నిత్యం విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీసు సిబ్బందికి క్రీడలు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్ రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ మీట్–2024 సోమవారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. తొలుత వంద మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. కలెక్టర్, ఎస్పీలతో పాటు పోలీసు అధికారులు వివిధ క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరచారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల విధుల్లో సమష్టిగా పనిచేయాలన్నారు. క్రీడల్లో కనబరచిన స్ఫూర్తిని మున్ముందు విధుల్లో కూడా ప్రదర్శించాలన్నారు. ఒత్తిడిని దూరం చేయాలంటే క్రీడలతోనే సాధ్యమవుతుందన్నారు. వ్యాయమానికి తగిన సమయం కేటాయించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్‌ఎస్పీ సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవికుమార్, బాబుప్రసాద్, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్, మురళీ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పోస్టుల మంజూరు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల కసరత్తులో భాగంగా తాత్కాలిక విధానంలో విధులు నిర్వహించేందుకు పోస్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు సోమవారం కలెక్టరేట్‌కు చేరాయి. కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్ కేడర్‌లో రెండు పోస్టులు, ఒక సీనియర్ అసిస్టెంట్ (డిప్యూటేషన్ విధానంలో), ఆఫీస్ సబార్డినేట్ 2, డేటా ఎంట్రీ పోస్టులు రెండు మంజూరు చేశారు. శాసనసభ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు ఒక డీటీ, ఒక సీనియర్ అసిస్టెంట్ (డిప్యూటేషన్), డేటాఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్ ఒక తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసుకోవాలని పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున మంజూరు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జూపార్క్‌కు కొత్తగా 12 జంతువులు



జూపార్క్‌కు చేరిన జింకలు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జూపార్క్‌కు చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ నుంచి 12 కొత్త జంతువులను సోమవారం తీసుకువచ్చారు. అందులో రెండు నక్కలు, నాలుగు థామిన్ జింకలు, ఆరు అడవి జింకలు ఉన్నట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఇదివరకే నీటి ఏనుగు వచ్చిందని, త్వరలోనే జిరాఫీ, జీబ్రాను సైతం తీసుకురానున్నట్లు వెల్లడించారు